# మాది-మీది

తలుపు దబదబా బాదుతున్నారు ఎవరో. చిన్న చిన్న చప్పుళ్ళు ఈ మహానగరం రొదలో వినిపించవు కదా. కరెంటు లేదు. అందుకే ఆ తలుపు బాదడం, లోపల చేస్తున్న వంటపని సగంలో ఆపేసి వెళ్లి (ఆ వెళ్ళడం కాస్త మెల్లిగా వెళ్ళాను-ఆ మధ్య కాలు జారి పడ్డం వల్ల మోకాలు బెణికి, గబగబా నడవ లేక పోతున్నాను. ఆ సంగతి అవతలి వాళ్ళకేం తెలుసు. బాదడం ఎక్కువైంది. నాకు గుండె దడదడలాడితే వాళ్ళకేం? తలుపు కొద్దిగా తెరిచి తొంగి చూశాను.

మేడమీది లావుపాటావిడ రొప్పుతూ కనిపించింది. తలుపు బాదినందుకు ఆవిడకు కొంత ఆయాసం వచ్చినట్టుంది.నన్ను చూడగానే "అంటీ!" అంది కంయ్యిమని. స్టేషన్ నుంచి బయలుదేరే ముందు రైలింజను కూసినట్లు. అసలు 'అంటీ' అంటేనే ఒళ్లుమంట నాకు. (ఈ మధ్య కానుకలు కావాలంటూ వచ్చే 'కొజ్జాలు' కూడా అదే పిలుపు మొదలు పెట్టారు!) మేడమీదావిడ నాకన్నా మహా అయితే నాలుగైదేళ్లు చిన్నదేమో! అందుకని కాదు. నా పేరు తెలుసుకోవచ్చుగా. ఆవిడ పేరు రంగనాయకి. వరస పెట్టి పిలవడం నాకలవాటు లేదు. పేరు తెలుసుకుని ఆ పేరు పెట్టి సంబోధిస్తూ ఉంటాను కాబట్టి అవిడ బతికిపోయింది. నేనూ ఆవిణ్ణి 'అంటీ' అని ఉంటే?... ఇప్పుడేం ప్రాణం మీది కొచ్చిందని పొద్దున్నే వంట టైములో వచ్చింది! నా కనుబొమలు ముడిపడ్డాయి. నా చూపు ఆవిడ చూపుతో ఢీకొంది అప్రయత్నంగానే.

"అంటీ, మీ పిల్లి మా పెరుగు గిన్నె పడగొట్టి పెరుగంతా నాకేసింది. ఇప్పుడు మా వారికి ఆఫీసుకి టైమైపోయింది. తీరా పెరుగు వడ్డిద్దామనుకునే సరికి గిన్నె ఖాళీ, ఇట్లా అయితే ఎట్లాగండీ!" అంటూ తన బాధని గుమ్మంలోనే కక్కేసింది.

ఆనాడు ఆ యశోద తల్లి ఎంత విలవిల్లాడిందో అర్థమైంది నాకు. యశోదదీ నాదీ కూడా పెంపుడు ప్రేమే. అందుకే అంత లోకువేమో ఇరుగు పొరుగు వాళ్ళకి! పిల్లల

సంగతీ, పిల్లల సంగతీ వాళ్ళకి తెలియదా? వాళ్ల జాగ్రత్తలో వాళ్ళుండొద్దూ? -ఏం, ఫ్రిజ్ ఉందిగా. పెరుగు గిన్నె బయటెందుకు పెట్టాలీ? తోడు పెట్టినదైతే మాత్రం, మూత మీద ఏదో బరువు పెట్టి, కిటికీ తలుపులు వేసి ఉంచుకోవద్దూ? నేను మాత్రం జాగ్రత్తపడ్డం లేదూ?

ఇదంతా ఆవిడతోఅనలేదు. "సారీ, అండీ, పెరుగు ఇమ్మంటారా?" అని, ఆవిడ సమాధానం కోసం ఎదురు చూడకుండా లోపలి కెళ్ళి ఓ కప్పుతో పెరుగు తీసుకొచ్చి ఇచ్చాను. "థాంక్స్ ఆంటీ, మళ్ళీ వచ్చి మాట్లాడతాను" అనేసి భారీ కాయాన్ని మోసుకుంటూ వెళ్ళిపోయింది. తలుపు కాస్త విసురుగానే మూసేసి (వర్షాకాలం ముద్దుగా వేస్తే మూసుకోవు తలుపులు) లోపలికి వెళ్ళిపోయాను.

గ్యాస్ పొయ్యి మళ్లీ వెలిగించి, సగం సగం వేగిన పోపుని మళ్ళీ పూర్తిగా వేయించి ఆ పులుసు మొహాన పడేశాను. మధ్యలో 'మూడ్' చెడితే ఏమవుతుంది!

పులుసు ముక్క నోట్లో పెట్టుకుని "ఏం జరిగింది ఇవ్వాళ?", అన్నారాయన-"పులుసు ఇలా తగలడిందేం?" అనకుండా!చెప్పాను. మేడమీదావిడ చేసిన పితూరీ గురించి. అవునుమరి, ఆవిడ తప్పేముంది?ఈ పిల్లులు మరీ 'న్యూసెన్స్' అయిపోయాయి. పట్టుకెళ్ళి ఎక్కడన్నా దూరంగా పారేసిరమ్మను ఎవరి నన్నా పిలిచి" అన్నారు. నాకు ఇంట్లోనే అసమ్మతి వర్గం ఉందాయెను!

ఈ ఇరుగు పొరుగు వాళ్లు చేసే గడుసు పనులు కనిపించవు ఎవరికీ. మొన్న పొద్దున్నే ఇంకా పూర్తిగా వెలుగైనా రాలేదు. కాఫీ తాగుతూండగా, 'మ్యాంమ్యాం' అని సన్నగా జంట స్వరం వినిపించేసరికి బాల్కనీలోకి వెళ్ళి చూశాను, కొత్త గొంతుల్లా అనిపించి. గేటు దగ్గర చెట్టు వెనక నుంచి వస్తోందా శబ్దం. వెళ్లి చూస్తే కొత్త పిల్లి పిల్లలు రెండు-నాలుగైదు వారాలైనా అయిందో లేదో పుట్టి-ఇంకా తల్లి పాలు తాగే వయస్సులో ఉన్నాయి.భయంతో ముడుచుకు పోతూ కీచు గొంతుతో ఏడుస్తున్నాయి. "ఎవరు పడేశారిక్కడ?" అని గేటు తెరిచి ఇటూ అటూ చూశాను. ఎవరూ కనిపించలేదు. అనుమానం వచ్చి గోడ పక్కకి వెళ్ళి చూశాను. పట్టు బడ్డాడు కుర్రాడు. అక్కడ నక్కినట్లు నుంచున్నాడు. ఏం జరుగుతుందో చూద్దామన్నట్లు.

"నువ్వేనా ఆ పిల్లి పిల్లల్ని ఇక్కడ పారేసింది? తీసికెళ్ళిపో వాటిని" అన్నాను దబాయింపుగా.

"మీ పిల్లి పిల్లలే తప్పిపోయాయనుకున్నా నాంటీ, అక్కడ రోడ్డు మీద అడ్డంగా పడుంటే, ఏ కారు కిందైనా పడతాయేమోనని తీసుకొచ్చాను" అన్నాడు.

"ఏం, మీ ఇంటికి పట్టు కెళ్ళకపోయావా? ఇక్కడ వదిలెయ్యడ మేమిటి" అన్నాను అదే దబాయింపు గొంతుతో.

"మీరు పిల్లుల్ని పెంచుతున్నారు కదా ఆంటీ.." అంటూ నసిగాడు.

"మేం కుక్కని పెంచితే, ఊళ్ళో ఉన్న కుక్క పిల్లల్ని పట్టుకొచ్చి మా ఇంట్లో పడేస్తావా?" అని అడిగాను.

"సారీ, ఆంటీ" అన్నాడు.

"సరే, వెళ్ళు. ఇంకెప్పుడూ ఇలాంటి పని చెయ్యకు" అన్నాను.

నిన్న పొద్దున్న మా ఇంట్లో పక్కవాటాలో కాపురం ఉంటున్న సావిత్రి "పిన్నిగారూ" అంటూ పిలిచింది. ఆ పిల్లిపిల్లల వల్ల రాత్రంతా నిద్ర చెడటమే కాకుండా, వాళ్ల వరండాలో ఆవిడ ఆరేసుకున్న చీర కింద పడిపోతే దాని మీద పొర్లి చీరంతా పాడుచేశాయట పిల్లిపిల్లలు. "వాటినిట్లా బయట వదిలేస్తే ఎట్లాగండీ?" అంది. "మా చంటి వాడి కసలే ఉబ్బసం జబ్బుంది. ఈ పిల్లులతో చాలా ఇబ్బంది అవుతందండీ" అని వంత పాడాడు ఆవిడ భర్త.

ఈ పిల్లుల వల్ల అందరిచేతా మాటలు పడలేక చస్తూంటే, ఈ మధ్య కుక్కల బాధ ఒకటి పట్టుకుంది. పిల్లులకి నేను పెరుగూ అన్నం, పాలూ అన్నం పెడుతున్నానని పసిగట్టి, వాటికి దొరకడం లేదన్న ఉక్రోషంతో-అసలే సహజంగా పిల్లులంటే పడవు కదా-గోడ దూకి పిల్లుల మీద ఎగబడ్డం మొదలు పెట్టాయి. గోడ ఎలా దూకుతుందని ఆశ్చర్యబోతున్నారా? అది పోలీసు కుక్కా కాదు, ట్రెయినింగయిన కుక్కా కాదు. గోడ పక్కన స్కూటర్ నిలబెట్టి ఉంటే, దాని మీదికెక్కి గోడ దూకడం అలవాటు చేసుకుంది. స్కూటర్ లేకపోతే, ఎవరైనా గేటు తెరిచినప్పుడు అదను చూసుకుని లోపలి కొచ్చేసి గొడవ చేస్తోంది. పళ్ళెం ఖాళీగా ఉంటే ఆ కుక్కకి పిల్లుల మీద మరింత కోపం రెచ్చిపోతుంది. 'బూర్జువా' దోపిడీ దారుల్ని చూస్తే నక్సలైట్లకి అనిపించినట్లు కడుపునిండా పాలన్నం తిని ఇంటి పట్టున చల్లగా పడుకునే ఆ పిల్లుల్ని చంపి పారెయ్యాలనిపిస్తుంది ఆ కుక్కకి. దానికి కూడా దక్కాల్సిన తిండీ, కొంపా పిల్లులొక్కటే అనుభవిస్తున్నాయని గుర్రు. పోనీ ఆ కుక్కకి కూడా కాస్త అన్నం గోడవతల పెడదామని ప్రయత్నించాను. అది చూసి ఆ వీథిలో ఉన్న కుక్కలన్నీ కొట్లాట కొస్తాయి. వాటిల్లో వాటికి మళ్ళీ పడదు. ఆ వీథంతా తనదే అన్నట్లు మొరుగుతుందో మచ్చల కుక్క. నల్లది "నీ ఎక్కువేమిటి" అన్నట్లు కుంయ్ కుంయ్ మంటుంది. బ్రౌన్‌ది డొక్కలంటుకుపోయి కడ్డీలా ఉంటుంది. దానికే అన్నిటి కన్నా దూకుడు. మా ఇంట్లో ఉన్న పిల్లుల పొడ గిట్టడం లేదు దానికి.

ఉన్న వాటికి తోడు ఇప్పుడు మరో రెండు పిల్లి కూనలు చేరాయి. ఇల్లు 'జూ'లా తయారయిందని ఆయన గోల. ఆయన అన్నట్లుగానే చుట్టు పక్కల పిల్లలందరూ పిల్లుల్ని చూడటానికి కుతూహలంగా వస్తూంటారు. పెద్దవాళ్ళు కూడా చంటి వాళ్ళని చంక నేసుకుని పిల్లుల్ని దూరం నుంచి చూపించి ఆడిస్తూంటారు. అందరికీ ఆసక్తీ, కుతూహలమే! కాని ఎవ్వరూ దగ్గరకి రానివ్వరు వాటిని.

ఆ కుక్కల బాధ భరించలేక మున్సిపాలిటీలో కుక్కల నిరోధక శాఖకి ఫోన్ చేసి చెబుదామనే ఆలోచన వచ్చింది. ఓ సారి ఫోన్ చేస్తే ఎవరూ ఎత్తక పోవడం, రెండు సార్లు రాంగ్ నంబరూ, రెండు మూడుసార్లు 'ఎంగేజ్డ్' శబ్దం-విసుగొచ్చి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను. అంతేకాక, మానవతా దృక్పథంతో-కుక్కల విషయంలో ఆ పదం సరియైనదవునో కాదోగాని-అలాంటి కరుణతో కూడిన దృష్టితో-పాపం వాటిని పంపించి చంపించే హక్కు నాకేముంది? వాటిని బతకనివ్వకుండా చేసేందుకు నాకేం హక్కుంది? ఏదో, చీమల్నీ, దోమల్నీ చంపటం అంటే 'పాపం' అనిపించదు. బొద్దింకల్ని కూడా చంపొచ్చు కొంచెం అసహ్యం అనిపించినా! కానీ కుక్కల్లాంటి పెద్ద జీవాల్ని చంపటం కర్కోటకం కదూ? (నేనసలే శాకాహారిని). ఎలకల గురించి పిల్లుల్ని పెంచినా, పిల్లి ఎలకని పట్టుకుని చంపి తింటూంటే పాపం, ఆ ఎలకని చూస్తే జాలేస్తుంది నాకు. పెద్ద జీవుల్ని చంపటం అన్యాయం అనిపించింది. అందుకేనేమో-ఇటువంటి పాపభీతితో నేమో, ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళూ, పోలీసు వాళ్ళూ పెద్ద పెద్ద వాళ్ళనీ, వి ఐ పి నేరస్థుల్నీ వదిలేసి, పిపీలకాలను పట్టుకుని వాళ్ళని చంపుకు తింటూ ఉంటారు!

హఠాత్తుగా గుర్తుకొచ్చింది. ఈ మధ్య 'బ్లూక్రాస్' వాళ్లు కుక్కల్ని చంపనివ్వడం లేదు కదా! మగ కుక్కల్ని పట్టుకుని పిల్లల్ని పుట్టించకుండా 'స్టెరిలైజ్' చేస్తున్నారట. పిల్లుల విషయంలో, ఆడ పిల్లుల్ని పట్టుకుని ఆపరేషన్ చేసి వదిలిపెడుతున్నారట. మగపిల్లుల్ని పట్టుకోవడం కష్టంట.

ఇంతకీ నా సమస్య ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే అన్నట్లుంది. రాత్రంతా కుక్క గొడవతో కునుకు పడితే ఒట్టు. పొద్దున్నే గుండె రాయి చేసుకుని పిల్లి పిల్లల్ని ఎక్కడికైనా దూరంగా పంపించెయ్యడానికి నిశ్చయించు కున్నాను. పోచమ్మ పనిలోకి రాగానే ముందుగా ఈ పని అప్పజెప్పాను. వాటిని పట్టుకెళ్ళి ఎక్కడన్నా దూరంగా వదిలేసి రమ్మని.

"అమ్మో, నావల్లగాదు తల్లో, అసలికే పిల్లలు గలదాన్ని. ఆ పాపం నాకొద్దు తల్లో" అంటూ చీపురు కట్ట పుచ్చుకుని వాకిలి చిమ్మడం మొదలు పెట్టింది. నా విన్నపాన్ని

వినిపించుకోలేదు. "నా ప్రాణాని కొచ్చి పడ్డాయి ఈ పిల్లులు, నాకర్మ" అంటూ నుదిటి మీద కొట్టు కున్నాను. ఏం చెయ్యాలో తెలియక. ఏమనుకుందో ఏమో పోచమ్మ, కొంచెం అయినాక, "నేబొయ్యేటప్పుడు ఆడ సెత్త కాయితాలు ఏరుకునేటోడుంటే తోలుకొస్త-ఆడికి పైసలిస్తే ఆడే సంచిలో పెట్టుకు కొంచుక బోతాడు" అంది.

"సరే, చెప్పిచూడు" అన్నాను.

రోజంతా ఎవడూ రాలేదు. రాత్రి మళ్లీ నిద్ర లేదు కుక్కల దూకుడుతో పిల్లి పిల్లలు గోల గోలగా ఏడుస్తున్నాయి. "ఈ తల్లిపీనుగ ఎక్కడ చచ్చిందో" అని విసుక్కుంటూ వాకిట్లో ఇటూ అటూ చూశాను. గోడకి అవతలి వైపున దారిలో నిజంగానే చచ్చిపడి ఉంది తల్లి పిల్లి. కుక్క దాని మెడపట్టుకుని చంపేసి ఉంటుంది.

పోచమ్మ ఈ రోజు పనిలోకి రాలేదు.

ఆ పిల్లి చచ్చిపడున్నచోటు అందరూ నడిచేదారి. పక్కవాటాల వాళ్ళూ. పై వాటాల వాళ్ళూ అటునుంచే నడిచి వెళ్ళాలి. ఎవరో ఒకరు వాళ్ళ పనిమనిషి చేత తీసేయించక పోతారా అని ఊరుకున్నాను. ఇంట్లో పనులు చూసుకోవడం మొదలు పెట్టాను. చిన్న పిల్లులికి ప్లేటులో పాలు పోసి పెడితే తాగి, నీళ్ళ తొట్టికీ, గోడకీ మధ్య ముడుచుకుని ఓదాని మీద ఓటి చేరి కుప్పలా పడుకున్నాయి. మరో పెద్ద పిల్లి ఎటుపోయిందో తెలియదు.

పనులన్నీ పూర్తయ్యాక మధ్యాహ్నం టి.వి. చూస్తున్నాను. ఒక వైపు మన జాతి, మనదేశం అంటూ జండావందనాలూ, మరో వైపు విజాతీయుల దురాగతాలూ, దురాక్రమణలూ, ప్రతిదేశంలోనూ జాతి మత కల్లోలాలూ, బాంబులూ, హత్యలూ, యుద్ధాలూ-ఇవే వార్తల్లో వింటున్నవీ కంటున్నవీ-మధ్యలో ఘాటుగా దుర్గంధం సోకింది. ఆ శవాల కంపు టీ.వీ. లోంచి వస్తున్నట్లుగా. చటుక్కున చచ్చిన పిల్లి గుర్తు కొచ్చింది. బాల్కనీలోకి వెళ్లి గోడవతలకి తొంగి చూశాను. ఆ పిల్లి అక్కడే పడుంది మరింత శుష్కించిపోయి. విపరీతంగా ఈగలు ముసురుతూ, కంపు కొడుతోంది. పైగా, దానిపైనా, చుట్టుపక్కలా రకరకాల చెత్త కూడా పేరుకుంది. కూరగాయలు తరిగిన తుక్కూ, పాడైపోయిన అన్నం కరుళ్ళూ, వగైరా, పక్కవాళ్ళూ, పై వాళ్ళూ ఆఫీసులకీ, బజారుకీ, స్కూళ్ళకీ, ఏదో పనిమీద అటునుంచి వెళ్ళే ఉంటారు. ఎవరూ పట్టించుకోలేదు. ఇంతలో వెనక వాటా ఆయన అక్కడికి వచ్చాడు. ఆయనకి ఆఫీసు లేదు. రిటైరైనవాడు. నన్ను చూడగానే ప్రాణం లేచొచ్చినట్లు. "కాస్త దాన్ని తీయించేయండి. వాసన భరించలేక పోతున్నాం. పొద్దుట్నించి తిండికూడా సయించట్లేదు" అన్నాడు.

"అదేమిటి, నేను తీయించడమేమిటి? మీరు నడిచే దారికదా. పొద్దున్న మీ పని మనుషుల చేత మీలో ఎవరైనా తీయించి ఉండొచ్చు కదా" అన్నాను.

"అది మీ పిల్లి కదండీ" అన్నాడు.

"అందుకని అందరూ అలా వదిలేసి ఊరుకున్నారన్నమాట" అన్నాను వెటకారంగా.

ఆయనేం మాట్లాడకుండా వీధిలోకి వెళ్ళిపోయాడు నిర్లక్ష్యంగా. నేను మాత్రం ఏం చెయ్యగలనని, లోపలికి వెళ్ళబోతూంటే, ఎదురు బ్లాక్‌లో మెట్లు ఊడ్చే భాగ్యమ్మ కనిపించింది. అది నల్లగా పోతపోసిన ఇనప విగ్రహంలా ఉంటుంది. అది చీపురు కట్ట పట్టుకు నడుస్తున్నా ఏదో ఆయుధం పట్టుకుని వస్తున్నట్లు దాన్ని పలకరించడానికే బెదురు పుడుతుంది. అయినా ధైర్యం చేసి పిలిచాను. వచ్చింది. "డబ్బు లిస్తాను, ఆ పిల్లిని తీసికెళ్ళి చెత్తకుండీలో పారేసి వస్తావా?" అని అడిగాను మొహమాటంగానే. ఆ చచ్చిన పిల్లికేసి ఒక్క క్షణం దీక్షగా చూసి, మొహం అటువైపుకి పెట్టుకుని "పదిహేను రూపాయలిస్తే పారేస్తా" అంది నిర్మొహమాటంగా.

"అయిదు రూపాయలిస్తాను. ఇక్కడ ఎవరూ ఒక్కపైస ఇవ్వడానికి సిద్ధంగా లేరు. నేనొక్కర్తెనీ ఇవ్వాలి" అన్నాను. బతిమాలుతున్న ధోరణిలో.

"అయిదు సాలవ్, సచ్చింది మీ పిల్లేగా?" అంది భాగ్యమ్మ. బేరం కుదరలేదు. వెన్ను విరుచుకుంటూ వెళ్ళిపోయింది.

నేను మాత్రం ఎందుకు పట్టించుకోవాలని లోపలికి వెళ్ళాను. కాని అంతలోనే ఓ సందేహం వచ్చింది. ఎవరైనా పట్టుదలగా ఆ చచ్చిన పిల్లిని గోడమీంచి మా వాకిట్లోకి విసిరేస్తే? అంత పని చేసినా చేస్తారని భయం వేసింది. మళ్ళీ ఇవతలికొచ్చి కాలు కాలిన పిల్లిలా తిరిగాను వాకిట్లో. ఏం చెయ్యాలో ఎవర్ని పట్టుకోవాలో తెలియక. వీధిలో దూరం నుంచి చిన్న కుర్రాళ్ళు–పేవ్‌మెంట్ల మీద ఉండే కుర్రాళ్లలా ఉన్నారు. వాళ్ళని చూడగానే దగ్గరికి పిలిచాను. "పైసలిస్తాను, పిల్లిని పారేసివస్తారా?" అని అడిగాను. చచ్చిన పిల్లిని చూసి, "ఎంతిస్తావ్?" అని అడిగాడు ఒకడు.

"ఎంతకావాలి?" అన్నాను.

"రెండు రూపాయలు" అన్నాడు.

"సరే, ఇద్దరికీ చెరో రెండు రూపాయలిస్తాను, జాగ్రత్తగా దూరంగా చెత్తకుండీలో పారేసి రండి" అని చెప్పి ఓ పాత న్యూస్ పేపరిచ్చాను. దాంతో ఆ పిల్లిని కప్పి, కాగితంతోటే తలకాయవైపు ఒకరూ, తోకని ఒకరూ పట్టుకుని తీసికెళ్ళి పారేసి వచ్చారు. వాళ్ళనిచేతులు కడుక్కోమని నీళ్ళుపోసి, తాగడానికి మంచి నీళ్ళడిగితే ఇచ్చి, నాలుగు

రూపాయలూ ఇచ్చాను. పాపం వాళ్ళని చూస్తే జాలేసింది. చిన్నవాళ్ళ చేత కూలి పని చేయించడం నేరం అని తెలుసు. కాని, ఊరికే తిరుగుతున్న వాళ్ళు ఈ చిన్న పని చేసి డబ్బులు సంపాదించి వాళ్ళకిష్టమైన దేదైనా కొనుక్కుని తింటారు కదా అనిపించింది. పెద్ద వాళ్ళ ఆశ ముందు వీళ్లది 'చిన్న చిన్న ఆశ!'

తెల్లవారాక పోచమ్మ రాగానే విరుచుకుపడ్డాను. నిన్న పనిలోకి చెప్పాపెట్టకుండా రానందుకూ, చెత్త కాయితాలు ఏరుకునే వాణ్ణి పిలుచుకురానందుకూనూ. చెప్పకుండా పనిలోకి రానందుకు ఏదో సంజాయిషీ ఇచ్చుకుంటుందనుకున్నాను. చీపురుకట్ట అక్కడ పడేసి గేటు తెరుచుకు బయటికి వెళ్ళింది. కొంపదీసి పనిలోకి రావడం పూర్తిగా మానుకుంటుందేమోనని గుండె జారిపోయింది. పనిమనిషిని కసిరితే పడే రోజులు కావివి. తప్పు నాదే! మర్యాదగా అడగాల్సింది మరి, మొహం వేళ్ళాడేసుకుని వంటింట్లోకి వెళ్ళాను. ఈ లోగా 'అమ్మా' అంటూ ఓ పొలికేక పెట్టింది పోచమ్మ. ప్రాణం లేచొచ్చింది. ఉత్తప్పుడైతే, "ఎందుకంతలా అరుస్తావ్ రోడ్డు మీంచి! మెల్లిగా పిలవలేవ్?' అని చివాట్లేసి ఉండేదాన్ని. ఇప్పుడు దాని పిలుపు మృదుమధురంగా వినిపించింది.

"ఏమిటి పోచమ్మా" అన్నాను బయటికి వచ్చి.

"ఆ సిత్తుకాయితాలాయ నొచ్చిండు" అంది.

"ఆ తొట్టి వెనకాల మూలనున్నాయి. పట్టుకెళ్ళు. వచ్చాక పైసలిస్తాను" అన్నాను అతనితో అయిదు రూపాయలిస్తానని చెప్పాను.

"ఓ సంచి గిట్టుంటే ఇయ్యండి" అన్నాడు. చిన్న సంచులు బట్టవి తప్ప గోనె సంచి లేదు ఇంట్లో. పక్కవాటాలో అద్దెకున్న వాళ్ల దగ్గరుందేమోనని వెళ్లి, సావిత్రి గారిని అడిగాను. "ఎందుకోసం?" అందావిడ. చెప్పాను-"పిల్లి పిల్లల్ని పంపించేద్దామని, ఆ పేపర్లతను తీసికెళ్లి దూరంగా పారేసివస్తానంటున్నాడు" అని.

ఆవిడ కొంచెం సేపు తటపటాయించి, "అయ్యో, ఇవ్వాళ శుక్రవారం కదా. ఇవ్వాళ పారేస్తే పాపం చుట్టుకుంటుంది. రేపు రమ్మనండి" అంది!

సరే, ఆ మాటే చెప్పాను అతనితో, అతను విసుక్కుంటూ వెళ్ళిపోయాడు.

పొద్దున్నే బాల్కనీలో నుంచుని పేపరు కోసం ఎదురు చూస్తుంటే, నందివర్ధనం చెట్టు కొమ్మల్ని గోడవతలనుంచి ఎవరో గుంజుతున్నట్లు శబ్దమయింది. మేకలొచ్చిపాడు చేస్తున్నాయేమోనని అదిలించడానికి గేటు తెరిచి బయటికి చూశాను. ఓ తొమ్మిది పదేళ్ళ పని కుర్రవాడు కొమ్మలు అందుకోవడానికి ఎగురుతున్నాడు.

"ఏయ్, ఎవరు నువ్వు?" అని కసిరాను.

వాడు కొంచెం బెదిరి, "పైన రెండో అంతస్తులో అమ్మగారు పంపించారండి. దేవుడి కోసం పువ్వులు కోసుకురమ్మన్నారండి" అన్నాడు, తన తప్పేంలేదన్నట్లు.

"ఏం, వాళ్ళ దేవుడు కావాలన్నాడా మా ఇంట్లో పువ్వులు? మా దేవుడి కక్కర్లేదా?..." అని వాణ్ణడిగి ఏం ప్రయోజనం?

"ఎక్కణ్ణించి కోసుకురమ్మన్నారు-మా ఇంట్లోంచా?" అని అడిగాను. అవునన్నాడు.

"పిలిచి అడగక్కర్లేదూ? చెప్పకుండా ఇష్టం వచ్చినట్లు కోసేసుకోవడమే?" అన్నాను.

"వీథిలోకి గోడ కివతల ఉన్నయే కోసుకురమ్మన్నారండి" అన్నాడు.

గోడవతలకి కొమ్మలు వాలగానే పువ్వులు వాళ్లవైపోతాయా? గోడవతల వాళ్ల దారిలో పిల్లి చచ్చిపడుంటే మాత్రం అది మా పిల్లి అవుతుందా! మనసులోనే గింజుకున్నాను.

"సరే కోసుకో" అన్నాను మధ్యవాడి తప్పేముంది అనుకుని.

చెత్త కాగితాలు ఏరుకునేవాడు మళ్ళీ రాలేదు. రోడ్డు మీద కనిపిస్తాడేమోనని వీథిలోకి తొంగి చూశాను గేటు తెరచి. మాగోడ దగ్గర ఎవడో నుంచుని...చూడలేక ముఖం అటు తిప్పుకున్నాను. పక్కింటి పనిమనిషి వాళ్ళింట్లో ఊడ్చుకొచ్చిన చెత్తంతా ఎదురింటి గోడ దగ్గరికి పట్టుకెళ్ళి పోస్తోంది!

ఎవరో ఇద్దరు కుర్రాళ్ళు ఇటే వస్తూ మా ఇంటి ముందు ఆగారు. "ఎవరు కావాలి?" అన్నాను.

"చందా కోసవండి-వినాయక చవితికి" అన్నారు. "మీరు స్టూడెంట్సా?" అని అడిగాను. వాళ్ళ వాలకం చూసి.

"అవును మేడమ్" అన్నారు ఉత్సాహంగా.

"మీరూ రోజూ ఇంట్లో పూజచేసి కాలేజీకి వెళతారా? రోజూ పూజ చేసుకునే అలవాటుందా మీకు?" అన్నాను.

వాళ్ళు తెల్లబోయి చూశారు నా కేసి, ఆ ప్రశ్న ఎందుకో అర్థం కాలేదు వాళ్ళకి.

"మీరిద్దరూ రోజూ ఇంట్లో పూజ చేసుకుంటారా?" అని మళ్ళీ అడిగాను.

లేదని బుర్ర అడ్డంగా ఊపారు.

"అయితే మీరు ఇలా పబ్లిగ్గా పూజ చెయ్యడం మాత్రం దేనికి?" అన్నాను.

"మన కాలనీలో అందరం కలిసి ప్రతి ఏటా చేస్తున్నాం కదండీ, గణేష్ పూజ" అన్నారు ఇద్దరూ ముక్త కంఠంతో.

"మన కాలనీ! అందరం! అబ్బో, ఈ విషయంలో చాలా ఐకమత్యం ఉందే!" అన్నాను.

"ఏంటి మేడమ్?" అన్నాడొకడు. అర్థంకాక. అవును, ఇటువంటి మాటలు అర్థం కావు. అర్థం చేసుకోరు. వీటి వెనక ఉన్న కథంతా చెప్పినా అంతే!

*('సరికొత్త కథ' సంకలనం, 1995)*